క్లుప్తంగా

మంత్రికి శబరిమల ప్రసాదాలు



మంత్రికి ప్రసాదాలు అందజేస్తున్న నాయకులు

సదుం: మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులు, రాష్ట్రంలో వైఎస్సార్ ఎన్నికల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఇటీవల మండలంలోని తాటిగుంటపాలెంకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు శబరిమల యాత్ర చేశారు. ఈ నేపథ్యంలో తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయనకు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి, ప్రభాకర, సుధాకర్, మనోజ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలోని గాండ్లపల్లెకు చెందిన వీఆర్‌ఏ రెడ్డెప్ప మృతి చెందాడు. ఇది తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం ఆ గ్రామానికి వెళ్లారు. రెడ్డెప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

వి.కోట: పట్టణంలోని సీవీఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కుప్పం పీఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో కళాశాల విద్యార్థులు 17 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ యుగంధర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

సాయినాథుని ఆలయంలో పౌర్ణమి వేడుకలు

- ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ



సాయినాథునికి మొక్కుతున్న ఎమ్మెల్యే

గంగవరం: పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో సాయినాథునికి ఉదయం నుంచి అర్చకులు విశేష పూజలు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి భక్తులు వందల సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఎమ్మెల్యేని శాలువాలతో సత్కరించి, బాబా ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, పలమనేరు ఏరియా ఆసుపత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, నాయకులు చంద్రప్ప, శ్రీరాములు రెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



పెద్దపంజాణి : ర్యాలీ చేస్తున్న మహిళలు

పెద్దపంజాణి: ఓటుహక్కు ఎంతో ప్రధానమైనదని, ప్రతిఒక్కరూ ఓటుహక్కు కలిగి ఉండాలని సీసీ వసంత కోరారు. సోమవారం మండలంలోని రాయలపేటలో డ్వాక్రా గ్రూపు మహిళలతో కలసి ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి ఓటు హక్కును సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘమిత్రలు నారాయణమ్మ, లత, కుమారి తదితరులు పాల్గొన్నారు.

జగమర్లలో...

పలమనేరు: ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం మొగిలీశ్వర్ కోరారు. మండలంలోని జగమర్లలో స్వీప్‌లో భాగంగా అక్కడి ఓటు హక్కు వినియోగంపై ర్యాలీతో మహిళా సంఘాలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో వయోజనులు బాధ్యతగా ఓటు వేయాలని ఇంటింటికీ వెళ్లి విజ్ఞప్తి చేశారు. వెలుగు సంఘ లీడర్లు, సంఘమిత్రలు, సీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మీ ఆశీస్సులతో గెలిపించండి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ భరత్



ఇఫ్తార్ విందులో ముస్లింలతో భరత్

రామకుప్పం: ''కుప్పం ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా..ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో మీ బిడ్డగా ఆశీర్వదించి అఖండ మెజారిటీతో నన్ను ఎమ్మెల్యేగా గెలిపించండి..కుప్పం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాను'' అని కుప్పం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి,ఎమ్మెల్సీ భరత్ ప్రజలను కోరారు. సోమవారం రామకుప్పంలో స్థానిక వైఎస్సార్ సీపీ నేతలతో కలసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలను కలసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను, పథకాల లబ్ధి పొందిన కుటుంబాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఎన్నికల హామీలను నూటికి నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. కుప్పంలో స్థిరనివాసం ఉంటూ పదేళ్లుగా ప్రజలకు తమ కుటుంబం అందుబాటు ఉందని, కరోనా కష్టకాలంలో ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించడంతోపాటు నిత్యావసర సరుకులను స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తల ద్వారా ప్రజలకు అందజేశామని, అదే సమయంలో ఇక్కడి ప్రజాప్రతినిధి చంద్రబాబునాయుడు పూర్తిగా ముఖం చాటేశారని గుర్తు చేశారు. అదేవిధంగా స్థానిక మార్వాడీలకు హోలీ శుభాకాంక్షలు తెలిపి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఇఫ్తార్ విందులో భరత్

రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా మండలంలోని ముద్దనపల్లె మసీదులో సోమవారం భరత్ ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. తొలుత ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో-కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచులు మురళీకృష్ణ, సికిందర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, రెస్కో డైరెక్టర్లు నాగిరెడ్డి, రవినాయక్, టౌన్ పార్టీ ప్రెసిడెంట్ అప్పి, యువజన విభాగం మండల అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, నేతలు తజీముల్ పాషా, ఏజస్, తస్లీద్, నారాయణస్వామి, ప్రసాద్, నయాజ్, పెనువేలు సింహ, హేమాచలపతి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ 'టీ' చేస్తే మమమ్మాస్!

ఎన్నికల ప్రచారంలో భరత్ మరోసారి తనదైన శైలిలో 'టీ' తయారు చేసి మళ్లీ ప్రజలను ఆకర్షించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఒక టీ కొట్టు వద్ద కొంతసేపు ఆగిన నేరుగా స్టౌ వద్దకు వెళ్లారు. ఈ పర్యాయం అల్లం మసాల టీ చేశారు. భరతన్నా..'టీ'నా..మజాకా అని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి ఒక కప్పు టీని రూ.500 కొన్నాడు. ఆ డబ్బును టీకొట్టు యజమాని కాంతరాజుకు అందజేశారు. మిగిలిన నాయకులు కూడా సాధారణ రేటు కంటే కొన్ని రెట్లు ఎక్కువ ఇవ్వడంతో కాంతరాజు ఖుషీ అయ్యాడు. భరతన్న తన అంగడికి వచ్చి టీ వేయడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు.



టీ దుకాణంలో టీ సిద్ధం చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

మేము సిద్ధం..మా బూత్ సిద్ధం

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



మంగళంలో మేము సిద్ధం...మా బూత్ సిద్ధం కరపత్రాలను విడుదల చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పెద్దిరెడ్డి, భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: మేము సిద్ధం..మా బూత్ సిద్ధం..అనే నినాదంతో సోమవారం మండలంలోని సింగిరిగుంట, మంగళం, భీమగానిపల్లెలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జోరుగా చేశారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, బోయకొండ చైర్మన్ నాగరాజారెడ్డి కరపత్ర ప్రచారం చేశారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రచారం చేస్తున్నామన్నారు. ఒకే కుటుంబం 30 ఏళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన పుంగనూరును ఐదేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్‌సీపీ పార్టీని అఖండ విజయంతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లె చెంగారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, రమణ, బాబు, సర్పంచు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కల్లూరులో..



పులిచెర్ల: సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు

పులిచెర్ల(కల్లూరు): మేము సిద్ధం..మా బూత్ సిద్ధం..పేరిట ఎన్నికల సమరంలో జోరుగా దూసుకుపోవాలని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ పిలుపునిచ్చారు. కల్లూరులో సోమవారం కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించాలని సూచించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, నవరత్నాల పథకాలతో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించి శాసనసభ్యులుగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, ఎంపీగా మిథున్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిద్దామన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముర్వత్ బాషా, ఆనంద, షుకూర్, మువ్వల నరశింహులుశెట్టి, రెడ్డి అహమ్మద్, చంద్రశేఖరరెడ్డి, షౌకత్‌అలీ, గోవిందరెడ్డి, షాజిద్ పాల్గొన్నారు.

టమాట ధరకు రెక్కలు

- బాక్సు రూ.250

పలమనేరు: వారం రోజుల నుంచి టమాట ధరలు పెరుగుతున్నాయి. పలమనేరు టమాట మార్కెట్‌లో సోమవారం బాక్సు(14కిలోలు) రూ.250 పలికింది. మార్చి తొలి వారంలో బాక్సు రూ.180 ఉండగా, మూడో వారానికల్లా ధరలు పెరగడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కావడం, భూగర్భ జలాల మట్టం పడిపోవడంతో దిగుబడి పెద్దగా రాక, డిమాండ్ పెరిగి, ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని స్థానిక మండీ యజమానులు పేర్కొన్నారు.



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

మైండ్ బ్లోయింగ్ బ్రెదరూ!



నేను అట్లాంటి..ఇట్లాంటి వాణ్ని కాను మేస్త్రీ హామీలకు మైండ్ బ్లోయింగ్ బ్రెదరు అంటిరీ..!

అనే లెవెల్లో అమరన్న 'ఆత్మీయ సమ్మేళన' గీతం బెంగళూరులో పాడేకాడికి పలమనేరులో రీసౌండ్ వచ్చింది. మొన్నటికి మొన్న అమరన్న బెంగళూరుకు పొయ్‌నాడంట! ప్రైవాసాంధ్రులతో మీటింగ్ పెట్నాడంట. ఏంబా..ఈసారి 'పలమనేరు సైకిల్'ఓవరాయిలింగ్ చేయాల..రంగులేయాల..జోరుగా పోయేదానికి గాలి కొట్టాల..అని వాళ్లకు బాగా గాలికొట్నాడంట. సరే! ఎలచ్చన్ టయిం కదా.. ఎదురైన పెతీ వోడికీ గాలి కొట్టడం కామన్..ఉబ్బేవాళ్లు ఉబ్బుతారు..దొబ్బేవాళ్లు దొబ్బుతారు. ఇక్కడ అమరన్న ఇచ్చిన హామీకి ఉబ్బాలా? దొబ్బాల్లో అర్థం కాక ప్రైవాసాంధ్రులు క్వశ్చన్ మార్క్ ఫేసులు పెటానరంట. ఏందిరా సామీ ఈ కత అంటే.. ఈడ పలమనేరులో సరస్వతీ కేపు, చర్చి, పద్మశ్రీ సరికిల్లులో కర్ణాటక ఆర్టీసీ వోళ్లు యాడబడితే బస్సులాపి ఎక్కించుకుంటాంటే ప్యాసింజర్లకు ఉస్సూబుస్సూ అని రన్నింగ్ రేసు మాదిరి పరిగెత్తా ఎక్కాల్సి వస్తాందంట. పిక్కబలమున్నోడు బస్సును అందుకుంటాడు..లేనోడు బస్సు గతి ఇంతే అని తత్వం అందుకుంటున్నాడని అమరన్న చెవిన పడిందంట! అంతే..ఈతూరి చెంద్రన్న ఇచ్చిన హామీల కంటే లోకల్‌గా డిపరెంటు హామీ ఇస్తే 'సూపర్' అని డిసైడైనాడు. అధికారంలోకి వస్తే ఒకేచోట ఈడ కర్ణాటక బస్సులా పిస్తా అని మైకులో గా..ట్టిగా చెప్పేకాడికి ఆడ టాక్ ఆఫ్ ద మీటింగ్ అయ్యిందంట! అమరన్న మీటింగ్‌కు పిలిచిన ప్రైవాసులంతా సొంత్ పార్టీలు..కార్లున్నోళ్లేనంట! వాళ్లు కార్లలో యాడికిబోవాలన్నా పోయేవాళ్లేగానీ బస్సులెక్కే టైపు కాదు కదా..అని కొందరు కిసుక్కున నవ్వినారంట. ఆ చేసేదేదో ఒక పార్టీలో గెలిచి, జంప్ జిలానీ అయ్యి, 'సైకిలెక్కి' మంత్రిగా ఉన్నప్పుడు ఎందుకుచేయలేకపోతివి?..ట్రాఫిక్ పోలీసోళ్లకు చెబితే వాళ్లు చిటికెలో చేసే పనేకదా!..ఇది చెప్పేదానికి ఇంతదూరం రావాల్నా? అని ప్రైవాసులు చెవులు కొరుక్కున్నారంట. అల్టిమేట్‌గా మా మైండ్ బ్లోయింగ్ బ్రెదరూ అని వాళ్లంతా ఎవరి కార్లలో వాళ్లు ఇళ్లకు పోయినారంట.

-పలమనేరు

ప్చ్.. అంతా మారిపోయార్రా..!

'పెద్దాయన వస్తాడంటే ఇంతకు ముందు పిలవకపోయినా ఎంత మంది వచ్చేవాళ్లో..! ఇప్పుడు రావాలని ఒకొకడిని పదిసార్లు పిలిచినా రాకుండా ఏమారుస్తాండారు. అంతా మారిపోయినార్రా. మనం రూలింగ్‌లో ఉంటే పచ్చ షర్టు తీయకుండా డ్రామాలు ఆడినోళ్లు కూడా ఇప్పుడు యా ప్రోగ్రాంకీ వచ్చేలేదు. సార్ బొమ్మను అడ్డం పెట్టుకుని లక్షలు సంపాదించిన (బూతు)-- గాడు కూడా ఇప్పుడు ఊర్లోకి మన నాయకులు వచ్చినా ఇంట్లోనే ఉండి లేదని చెప్పిస్తాండాడు. లాస్టుకు పెద్దాయన(చంద్రబాబు) మీటింగ్‌కు రమ్మని నిన్నంతా ఇల్లిల్లా తిరిగినా ఎందరు కదిలారో సూస్తివా? రేపు ఎలక్షన్‌లో ఏమేమి చేస్తారో ?!' సర్పంచుగా పోటీ చేసి ఓటమి పాలైన ఒక టీడీపీ నాయకుడి ఆవేదన ఇది. సోమవారం కుప్పంలో చంద్రబాబు సభకు వెళ్లి తిరిగివచ్చాక శాంతిపురంలో ఇక దుకాణం వద్ద తనతో కలిసిన సొంత పార్టీ కార్యకర్తతో తన ఆక్రోశం వెళ్లగక్కాడు. 'అవునన్నా. ఈ మధ్య ఊర్లో ప్రచారానికి కూడా మనోళ్లు సరిగ్గా వచ్చేది లేదు. జనాలూ రావడం లేదు' అని ఆ కార్యకర్త నాయకుడిని ఓదార్చాడు. కుప్పంలో సోమవారం జరిగిన చంద్రబాబు సభకు ప్రతి పంచాయతీ నుంచి కనీసం వంద మందిని రప్పించాలని టీడీపీ నాయకులు స్కెచ్ వేశారు. ఆదివారం నియోజకవర్గంలోని అందరి మొబైల్ ఫోన్లకు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేరుతో రికార్డు చేసిన వాయిస్ కాల్‌ను పదే పదే వినిపించారు. కానీ జనసమీకరణలో అంచనాలు తలకిందులు కావడంతో తేలుకుట్టిన దొంగల్లా సైలెంటయ్యారు. వైఫల్యానికి పక్క వారిని బాధ్యులుగా చూపేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

- శాంతిపురం

రథోత్సవం



శాంతిపురం: రథంపై ఊరేగుతున్న స్వామి వారు

శాంతిపురం: రాళ్లబూదుగూరులోని పురాతన శ్రీ కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రెడ్డి కుల సంఘం ఆధ్వర్యంలో రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన రాతి చక్రాల రథంపై కొలువుదీరిన సీతాలక్ష్మణ సమేతుడైన కోదండరాముడు భక్తులకు కనువిందు చేశారు. భక్తులు రథంపై ఉప్పు, మిరియాలు, దవనం చల్లి మొక్కులు చెల్లించారు. రథం ముందు కేరళ వాయిద్యాలు, మంగళ వాయిద్యాలు, కోలాటలు, డప్పు కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ తన సతీమణి దుర్గతో కలిసి స్వామి వారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలంలో కడపనత్తం సమీపంలోని శ్రీనల్లగుండ్రాయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం కోలాహలంగా నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మరథంపై అలివేలు మంగమ్మ, పద్మావతి సమేత శ్రీ నల్లగుండ్రాయస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు ప్రక్కల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు రథాన్ని లాగారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.



బైరెడ్డిపల్లె: కడపనత్తం ఆలయం వద్ద రథం లాగుతున్న భక్తులు

ఉయ్యాలసేవ



గంగవరం: పౌర్ణమి సందర్భంగా మండలంలో టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీ కోనేటిరాయస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామివారికి ఉయ్యాలసేవ కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీకోనేటి రాయుని కొలువు దీర్చి మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణ నడుమ ఈ కార్యక్రమం నిర్వహించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు.

పుంగనూరులో జోరుగా ప్రచారం





ప్రచారం చేస్తున్న ముత్తంశెట్టి విశ్వనాథ్, ఎంబీటీ రోడ్డులో ప్రచారం చేస్తున్న కృష్ణమూర్తి, నాగభూషణం

పుంగనూరు: రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు మార్గదర్శకుడుగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, ఆయన పాలన చరిత్ర సృష్టించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిలర్ ముత్తంశెట్టి విశ్వనాథ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. కొత్తపేట, ఎంబీటీ రోడ్డు, గోకుల్‌వీధి, రహమత్‌నగర్, కట్టక్రిందపాళ్యెం, చింతలవీధి, ఎన్ఎస్ పేట, కుమ్మరవీధి ప్రాంతాలలో కరపత్ర ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో మాయమాటలతో, గారడీ మ్యానిఫెస్టోతో ప్రజలను మోసగించేందుకు వచ్చే ఉమ్మడి పార్టీ అభ్యర్థులకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డికి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి మెజార్టీతో గెలిపించాలని కోరారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కౌన్సిలర్లు ఆదిలక్ష్మి, జయభారతి, రేష్మా, రెడ్డెమ్మ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆవుల అమరేంద్ర పాల్గొన్నారు.

ఆనంద కేళి.. రంగుల హోలీ



పలమనేరు: రంగులు చల్లుకుంటున్న రాజస్థానీ మహిళలు, చిన్నారులు

రొంపిచెర్ల: రొంపిచెర్లలో సోమవారం హోలీ వేడుకలను రాజస్థాన్ యువకులు ఘనంగా నిర్వహించారు. రాజస్థాన్‌కు చెందిన పలువురు స్థానికంగా బంగారు, కుదువ వ్యాపారాలు, టీ స్టాల్స్, కూల్‌డ్రింక్స్, బట్టల షాపులను నిర్వహిస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. వీరు ప్రతి ఏటా హోలీ పండుగను ఘనంగా నిర్వహించడం పరిపాటి. ఆదివారం రాత్రి హోలిక దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఉదయం పురవీధులలో యువకులు కేరింతలు కొడుతూ రంగులు చల్లుకున్నారు. నేమ్‌చంద్ పటేల్, దుర్గారామ్, రవి, సురేష్, దీపక్, సోను, యర్రంరెడ్డి, ఓంప్రకాష్, మహేష్, సతోష్, వెంకీ పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని రాజస్థానీయుల కుటుంబాలు సోమవారం హోలీ పండుగను ఘనంగా నిర్వహించాయి. ఒకరిపై మరొకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జైసింగ్, గణపత్, హరీష్, జైరామ్, విష్ణుశర్మతో పాటు పలు రాజస్థానీ కుటుంబాలు పాల్గొన్నాయి.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: హోలీ పండుగ వేడుకలు బైరెడ్డిపల్లెలో ఘనంగా నిర్వహించారు. వయోభేదం లేకుండా రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగిపోయారు. యువతీ యువకులు రంగులు చల్లుకోవడంతో పాటు రంగు నీళ్లు చల్లుకుంటూ నృత్యాలు చేశారు. రాజస్థానీ మార్వాడీలు ఆయిమాతా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



రొంపిచెర్లలో హోలీ సంబరాల్లో రాజస్థానీయులు



పలమనేరు: హోలీ వేడుకల్లో రాజస్థానీ మహిళలు





బైరెడ్డిపల్లె: రంగునీళ్లు చల్లుకుంటూ హోలీ సంబరాలు చేసుకుంటున్న యువతీ యువకులు, హోలీ సంబరాల్లో మార్వాడీలు